క్లుప్తంగా

సామాజికాభివృద్ధిలో మహిళలదే కీలక పాత్ర



చీరలను అందజేస్తున్న జెడ్పీటీసీ తన్వీ

శంషాబాద్: సామాజికాభివృద్ధిలో మహిళలదే కీలక పాత్ర అని జెడ్పీటీసీ సభ్యురాలు నీరటి తన్వీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మహిళా వీఓఏలకు పట్టణంలోని తన నివాసంలో చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో మహిళల పట్ల ఉన్న వివక్షత, అణచివేత ధోరణి పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ఏపీఎం వి. అహల్య పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో వెలుగులు నింపేందుకే కంటి వెలుగు



కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అర్చనజయప్రకాష్

రాజేంద్రనగర్: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో సంపూర్ణ అంధత్వ నిర్మూలన చేసి ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగు అందించాలనే లక్ష్యంతో కంటి వెలుగును ప్రతి ఇంటికీ తీసుకువెళతామని రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఉప్పర్‌పల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఎక్కడ కంటి వెలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కంటి పరీక్షలు చేయించుకుంటున్నారన్నారు.

ఆరోగ్యం కోసం చిరుధాన్యాలు ఉపయోగించాలి



మిల్లెట్స్‌లో అల్పాహారం తీసుకుంటున్న నాయకులు

రాజేంద్రనగర్: ప్రజలు తమ ఆరోగ్యాలను జాగ్రత్తగా కాపాడుకునేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని రాజేంద్రనగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు వై.శ్రీధర్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ గాంధీనగర్‌లో మిల్లెట్స్ అల్పాహారం ప్రజల ఆరోగ్యాల కోసం చిరు దినుసుల గురించి అవగాహన కల్పించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంజన్‌కుమార్‌గౌడ్, డి.సత్యనారాయణముదిరాజ్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేందుకు ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ తెలిపారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్ ప్రాంతానికి చెందిన లక్ష్మీనారాయణకు రూ.36 వేలు, దర్గాఖలీజ్‌ఖాన్ ప్రాంతానికి చెందిన నారాయణపల్లి లక్ష్మమ్మకు రూ.36 వేల చెక్కులను బుధవారం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరంలా మారిందన్నారు.

యువకులు క్రీడల్లో రాణించాలి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కౌన్సిలర్, మాజీ సర్పంచ్‌లు

మణికొండ: యువకులు తమకు నచ్చిన క్రీడను ఎంచుకుని అందులో రాణించి శారీరక ధారుడ్యంతో పాటు మంచి స్నేహ సంబంధాలతో ఉండాలని నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్ కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఖానాపూర్ స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఇలాంటి క్రీడా టోర్నమెంట్లు యువతకు మంచి పేరు తెస్తాయన్నారు.

గడువు 15 రోజులు మాత్రమే..

బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ | లక్ష్యం చేరుకునేందుకు కసరత్తు చేస్తున్న అధికారులు.. | 2022-23 పన్ను వసూళ్ల టార్గెట్ రూ.21.50 కోట్లు..

బండ్లగూడ: ఈ నెలతో ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆస్తి పన్ను వసూలుపై మున్సిపల్ అధికారులు దృష్టి కేంద్రీకరించారు. కార్పొరేషన్‌కు పన్నుల రూపంలో ఆదాయం భారీగా సమకూరుతోంది. సుదీర్ఘ కాలం పాటు ఇంటిపన్ను చెల్లించని వారి ఇంటికి డ్రైనేజీ, నల్లా కనెక్షన్లను అధికారులు తొలగిస్తున్నారు. గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 28,200కు పైగా నివాసాలకు అసెస్‌మెంటు చేసి ఉండగా, కొంత మంది సకాలంలో పన్ను చెల్లించకపోవడంతో అపరాధ రుసుము రూపంలో కలిపి మొత్తం ఆదాయం రూ.10.61 కోట్లు వచ్చింది..

రూ.21.50 కోట్ల టార్గెట్

2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 31,548 నివాసాలకు అసెస్‌మెంటు చేయగా, రూ. 21.50 కోట్ల టార్గెట్ నిర్దేశించగా, ఇప్పటి వరకు 14.42 కోట్ల రూపాయలు వసూలయ్యాయి. మిగతా రావలసిన రూ.7.08 కోట్లు మార్చి నెలాఖరు వరకు వసూలు చేయనున్నారు.

పన్నుపై రాయితీలు..

మున్సిపల్ కార్పొరేషన్ పన్నుపై రాయితీ ఇస్తోంది. ఏప్రిల్ నెలలో మొత్తం సంవత్సరం పన్ను చెల్లిస్తే 5శాతం రాయితీ ఇస్తుంది. ప్రతి సంవత్సరంలో చెల్లించవలసిన పన్నులు సకాలంలో చెల్లించకపోతే పెనాల్టీ విధిస్తున్నారు. రాయితీలను సద్వినియోగం చేసుకునేవారు తక్కువగా ఉంటే చాలా మంది మార్చి నెలలోనే పన్నులు చెల్లించేందుకు మొగ్గు చూపుతున్నారు.

గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో రూ.లక్షల్లో ఆదాయం వచ్చేది. పన్నులు కట్టడానికి ఆసక్తి చూపని ప్రజలు కార్పొరేషన్ ఏర్పడిన అనంతరం నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు అసెస్‌మెంట్ పూర్తి చేయడంతో పాటు ఇంటి నెంబర్లు కేటాయించి పన్నులు విధించడంతో కార్పొరేషన్‌కు ఆదాయం భారీగా పెరుగుతోంది.

పన్ను చెల్లించని వారిపై చర్యలు..

కార్పొరేషన్ పరిధిలో సుదీర్ఘకాలం పాటు ఇంటి పన్ను చెల్లించని వారిపై కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. కార్పొరేషన్ పరిధి హైదర్షాకోట్ కఫిలానగర్ కాలనీలో 2017 నుండి ఇప్పటివరకు పన్ను చెల్లించని ఇంటికి బుధవారం కార్పొరేషన్ అధికారులు నల్లా, డ్రైనేజీ కనెక్షన్లను తొలగించారు. ఆఇంటిపై ఇప్పటి వరకు 80 వేల 619 రూ. పన్ను చెల్లించవలసి ఉందని అధికారులు తెలిపారు.



బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

కార్పొరేషన్ పరిధి 200 కాలనీలు, 1.50లక్షల జనాభా..

మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కిస్మత్‌పూర్, దర్గా ఖలీజ్ ఖాన్, హిమాయత్ సాగర్, హైదర్‌షాకోట్, బండ్లగూడజాగీర్, పీరంచెరువు, గంధంగూడ, బైరాగి గూడ తదితర ప్రాంతాలు కలిసి కార్పొరేషన్‌గా ఏర్పడింది. ప్రస్తుతం 31,548 నివాసగృహాలు ఉండగా 200 కాలనీలు ఏర్పడ్డాయి. జనాభా 1.50 లక్షల వరకు ఉంటుందని అంచనా.

పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్..

కేవలం 15 రోజులు గడువు ఉండటంతో పన్నులు వసూలు చేయాలనే లక్ష్యంతో కార్పొరేషన్ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. రెండు సంవత్సరాల నుండి పన్నులు కట్టని వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. స్మార్ట్‌ఫోన్ ద్వారా ప్రభుత్వం రూపొందించిన వెబ్‌సైట్ నుండి, మీ సేవ కేంద్రాల ద్వారా చెల్లించాలని తెలుపుతూ టార్గెట్‌కు చేరుకునేందుకు బిల్ కలెక్టర్‌లు, కార్పొరేషన్ సిబ్బంది కృషి చేస్తున్నారు.

అదాయం పెంచడమే లక్ష్యంగా



మున్సిపల్ కార్పొరేషన్‌కు అదాయం పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించి సకాలంలో పన్ను చెల్లిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రజలు చెల్లిస్తున్న ప్రతి రూపాయిని కార్పొరేషన్ అభివృద్ధి కోసమే ఖర్చు చేస్తాం.మొండి బకాయిదారులపై కఠిన వైఖరి ప్రదర్శిస్తాం. మరిన్ని అభివృద్ధి పనులకు గాను ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

- వేణుగోపాల్‌రెడ్డి, కమిషనర్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్

అభివృద్ధి పనుల పరిశీలన



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను డీఈ నరసింహారాజు, కౌన్సిలర్‌లు జి.శివారెడ్డి, జి.విజయ్‌బాబు, ఎ.దుర్గేశ్‌యాదవ్ బుధవారం పరిశీలించారు. గ్రామంలోని మెయిన్ కమ్యూనిటీ హాల్, ఎస్సీ కమ్యూనిటీ హాల్, రాజీవ్ గృహ కల్ప కమ్యూనిటీహాల్, శ్మశానవాటికలోని స్నానాల గదులు, అంత్యక్రియల ఘాట్ పనులను పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను పూర్తి స్థాయి నాణ్యతతో ఉండాలని సూచించారు.

ముగిసిన వారోత్సవాలు




షీల్డ్ అందజేస్తున్న డిప్యూటీ కమీషనర్ జగన్

రాజేంద్రనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వారోత్సవాలు బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా ముగిశాయి. మహిళలు నిర్వహించిన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్తమ ప్రతిభకనబరిచిన వారికి ముగింపు సందర్భంగా ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులుగా సర్కిల్ డిప్యూటీ కమీషనర్ జగన్, ఏఎంహెచ్‌వో అంజనేయులు హాజరయ్యారు.

దీపం అంటుకొని మహిళకు తీవ్ర గాయాలు

రాజేంద్రనగర్: తులసి మొక్కకు పూజ చేస్తుండగా వెలిగించిన దీపం చీరకు అంటుకోవడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు.. హైదర్‌గూడ అంబియన్స్‌ఫోర్ట్ విల్లాలో ప్రవీణ్ గొవెల్ తన భార్య పూజా గొవెల్(35)తో కలిసి నివసిస్తున్నాడు. ఈ నెల 13వ తేదీన ఉదయం ఇంటి ఆవరణలో ఉన్న తులసి మొక్కకు పూజలు నిర్వహించి దీపం వెలిగించింది. అనంతరం దీపం ముందు ధ్యానం చేస్తూ కూర్చుంది. ప్రమాదవశాత్తు పూజాగొవెల్ చీరకు దీపం అంటుకోవడంతో తీవ్ర గాయాలకు గురైంది. సిల్క్ చీర ధరించడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి కేలు వేయడంతో పక్కనే ఉన్న ఇంటి యజమానురాలు గమనించి మంటలను ఆర్పి స్థానికుల సహాయంతో హైదర్‌గూడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన చికిత్సకు డిఆర్‌డివో అపోలో ఆసుపత్రికి తరలించారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్రీయ ఉపకార వేతనాలకు ఆరుగురు విద్యార్థుల ఎంపిక



బిందు | జాహ్నవి దుర్గ | శివ | నవ్య శ్రీ | నతానేల్ జేదిద్య

గచ్చిబౌలి: కేంద్రీయ ఉపకార వేతనాల(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు కొండాపూర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు అనంత రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం 2022 డిసెంబర్ 18న ప్రవేశ పరీక్ష నిర్వహించింది. ఈ ప్రవేశ పరీక్షలో కొండాపూర్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు దిండి బిందు, వాసంశెట్టి జాహ్నవి దుర్గ , గుమ్మడవెల్లి శివ, ఎల్.కె.నవ్య శ్రీ, నాగేటి నతానేల్ జేదిద్య, ముంగ్యా అఖిల ప్రతిభ కనబరిచి స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు నాలుగేళ్ల పాటు నెలకు వెయ్యి రూపాయల చొప్పున కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనం అందిస్తుందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఆరు నెలల పాటు పక్కా ప్రణాళిక ప్రకారం శ్రమించి ప్రవేశ పరీక్ష రాశారని, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మియాపూర్ : చందానగర్ డివిజన్ పరిధిలోని గౌతమీనగర్ కాలనీలో చందానగర్ సర్కిల్ -21 ఉపకమీషనర్ సుధాంశ్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కాలనీ వాసులు కాలనీలో సమస్యలను అతని దృష్టికి తీసుకువెళ్లారు. కాలనీలోని మున్సిపల్ పార్క్‌ను అభివృద్ధికి సహకరించాలని అదేవిధంగా ట్రాఫిక్ సమస్యకు చర్యలు తీసుకోవాలని, అదే విధంగా కాలనీలో పెండింగ్‌లో అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

'మనూ'లో దూరవిద్యలో డ్రాపౌట్లకు మళ్లీ అవకాశం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలోని దూరవిద్యా విభాగంలో డ్రాపౌట్లకు మళ్లీ ప్రవేశం కల్పించాలని నిర్ణయించినట్లు 'మనూ' డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (డీడీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ బుధవారం తెలిపారు. డీడీఈ ఆధ్వర్యంలో రీఅడ్మిషన్‌లను 2005 ఆతర్వాత బ్యాచ్‌లు, అంతేకాకుండా యూజీ , 2014 నుంచి వార్షిక మోడ్‌లో పీజీ యొక్క ఫాలో-ఆన్-కోర్సులలో నమోదు కోసం ఫీజు చెల్లింపు పోర్టల్‌ను తెరిచిందన్నారు.

కాలనీలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

రాయదుర్గం: ప్రతీకాలనీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని నానక్‌రాంగూడలో ఆయన స్థానికులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను కార్పొరేటర్‌కు వివరించారు.

నియంతృత్వ పాలనను అంతం చేయడమే బీజేపీ లక్ష్యం

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్రంలో నియంతృత్వ, రాచరికపుపాలనను అంతం చేయడమే బీజేపీ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం మసీదుబండలో పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ.. దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్ళడానికి నిరంతరం కృషిచేస్తున్నారన్నారు. ఈ సారి ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలోనేకాకుండా శేరిలింగంపల్లిలో కాషాయజెండా ఎగురవేయడం ఖాయమన్నారు.

మద్యం మత్తులో ఉన్న ప్రయాణికుడిని అనుమతించని ఇండిగో

- ఉద్యోగిపై దాడికి దిగిన ప్రయాణికుడు
- కేసు నమోదు చేసిన ఆర్‌జీఐఏ పోలీసులు

శంషాబాద్: అతిగా మద్యం సేవించి స్పృహలో సరిగా లేని కారణంగా ప్రయాణికుడిని ఇండిగో ఎయిర్‌లైన్స్ అనుమతించలేదు. దీంతో కొన్ని గంటల తర్వాత చిర్రెత్తుకొచ్చిన సదరు ప్రయాణికుడు ఇండిగో ఉద్యోగిపై దాడికి దిగిన సంఘటన శంషాబాద్ విమానాశ్రయంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తమిళనాడుకు చెదిన దీపక్ పరేక్ (23) విదేశాలకు వెళ్లేందుకు మంగళవారం అర్ధరాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. అయితే అతడు మద్యం మత్తులో ఉండడంతో ఇండిగో ఎయిర్‌లైన్స్ అతడి ప్రయాణానికి నిరాకరించింది. మరో నాలుగు గంటల తర్వాత హెచ్-13 కౌంటర్ వద్ద అతడు బిగ్గరగా అరవడం మొదలు పెట్టాడు దీంతో ఇండిగో సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తోన్న లింగం అరుణ్ అలా అరవకూడదంటూ అతడికి సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. దీంతో ప్రయాణికుడు ఒక్కసారిగా బూతులు తిడుతూ అతడిపై దాడికి దిగాడు. ఈ విషయమై ఎయిర్‌పోర్టులో ఉన్న పోలీసులకు లింగం అరుణ్ ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేసిన పోలీసులు నిర్ధారించుకుని అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

గాలిదొడ్డిలో నిలిచిన నిర్మాణాలు

సాక్షి ఎఫెక్ట్..



మణికొండ: ఎలాంటి అనుమతులు లేకుండా జీవో 111 పరిధిలోని గాలిదొడ్డిలో కొనసాగుతున్న నిర్మాణాలు ఎట్టకేలకు నిలిచిపోయాయి. ఇటు ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడంతో పాటు ఇష్టారాజ్యంగా అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. అదే విషయాన్ని 'సాక్షి' దినపత్రికలో 'అనుమతులు లేకున్నా.. అక్రమ నిర్మాణాల జోరు అనే శీర్షికన కథనం ప్రచురించటంతో మున్సిపల్ శాఖ అధికారులు వెంటనే స్పందించారు. తమ సిబ్బందిని పంపి కొనసాగుతున్న నిర్మాణాల పనులను నిలిపివేయటంతో పాటు పనులు కొనసాగించేందుకు ఉపయోగిస్తున్న సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

సీఎంఓకు ఫిర్యాదులు...

బుధవారం 'సాక్షి' పత్రికలో వచ్చిన కథనాన్ని మున్సిపల్ ప్రజలు ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయం, రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్, అధనపు కలెక్టర్‌లకు ట్విట్టర్, మెయిల్, వాట్సాప్‌ల ద్వార ఫిర్యాదులు చేశారు. దాంతో మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర నివేదికను అందించాలని వారు ఆదేశించినట్టు సమాచారం.

టౌన్‌ప్లానింగ్ అధికారికి జైలు, జరిమానా

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో గతంలో టౌన్‌ప్లానింగ్ అధికారిగా పని చేసిన ఆర్.రాజ్యశ్రీకి ఏసీబీ ఫస్ట్ అడిషనల్ స్పెషల్ కోర్టు బుధవారం రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు పది వేల రూపాయల జరిమానా విధిస్తు తీర్పు వెలువరిచింది. 2012వ సంవత్సరం నవంబర్ 7వ తేదీన గృహ నిర్మాణానికి సంబంధించి ఎస్.ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి నుంచి టౌన్‌ప్లానింగ్ అధికారిణి రాజ్యశ్రీ అనుమతుల కోసం తాను నియమించుకున్న ప్రైవేటు అసిస్టెంట్ జి.శ్రీపతితో కలిసి 20 వేల లంచం తీసుకుంటూ పట్టుబడింది. కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. 2012వ సంవత్సరం నుంచి కేసు కొనసాగింది. బుధవారం తుది తీర్పు ప్రకటించింది. టౌన్‌ప్లానింగ్ అధికారిణి రాజ్యశ్రీకి రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు పది వేల రూపాయల అపరాధ రుసుము విధించింది. అపరాధ రుసుము చెల్లించకపోతే మూడు నెలల అదనంగా శిక్ష విధించాలని తీర్పు చెప్పింది. అలాగే ప్రైవేటు అసిస్టెంట్ జి.శ్రీపతికి ఆరు నెలల జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానా, జరిమానా కట్టకపోతే మూడు నెలల శిక్ష ఖరారు చేస్తూ తీర్పు ఇచ్చింది.

కాన్షీరామ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: బడుగు, బలహీన వర్గాల జీవితాల కోసం అహర్నిశలు కృషి చేసిన కాన్షీరామ్ ఆశయాలను కొనసాగిస్తామని రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు పలుగుచెరువు మహేష్ తెలిపారు. రాజేంద్రనగర్ అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం కాన్షీరామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ జాతిని మేల్కొలిపే దిశగా విద్యా, ఉపాధి కోసం ప్రతి ఒక్కరిని కలుపుకొని ముందుకు సాగుతామన్నారు. ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్, ముఖ్య సలహాదారులు పోయిల జీవన్‌దాస్, పోతురాజు యాదన్న పాల్గొన్నారు.

సోషల్‌మీడియాలో ప్రతి ఒక్కరూ యాక్టివ్



సింపోజియంలో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: ప్రస్తుతం ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారని అనురాగ్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సైదా సమీన్‌ఫాతిమా పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'లింగ సమానత్వం అండ్ డిజిటల్ స్పేస్‌లలో మహిళల రక్షణ' అనే అంశంపై ప్రత్యేక సింపోజియంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ సిస్టమ్‌లో లోపాలు ఉన్నాయని, ఫలితంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. అన్ని రంగాలలో మహిళలకు న్యాయం సమాన వేతనాలు, సమాన అవకాశాలు ఉన్నాయన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: వేసవిలో నీటి సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం జలమండలి అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓ వైపు వేసవి, మరో వైపు ఈ నెలలోనే రంజాన్ మాసపు ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ రెండింటిని దృష్టిలో పెట్టుకుని అధికారులు నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. జలమండలి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఎప్పుడూ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటారని ఆయన పేర్కొన్నారు. అయితే వేసవిలో కార్వాన్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో నీటి సరఫరాలో అవాంతరాలు ఏర్పడడమే కాకుండా లో ప్రెషర్ సమస్య తలెత్తుతుందని ఆయన అన్నారు. ఎత్తయిన బస్తీల్లో లో ప్రెషర్ సమస్య ఎక్కువగా ఉందని ఆయన అన్నారు. అటువంటి ప్రదేశాలను గుర్తించి పవర్ బూస్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడానికి ట్యాంకర్లతో పాటు సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని ఆయన సూచించారు. కార్వాన్‌లో ప్రస్తుతం డ్రైనేజీ, వరద నీటి పైప్‌లైన్ పనులు జోరుగా జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలతో పాటు ప్రార్థనా స్థలాల పరిసరాలలో జరుగుతున్న పనులను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయించాలన్నారు. కార్వాన్, టోలీచౌకి డివిజన్లలో జరుగుతున్న పైప్‌లైన్ పనులను ఉన్నతాధికారులు పరిశీలించి అవి సకాలంలో పూర్తయ్యేలా చూడాలని ఆయన అన్నారు. జలమండలి ఆపరేషన్స్ డైరెక్టర్ కృష్ణ అజ్మీర, జలమండలి డీజీఎం ఖాజా జవహర్‌అలీ, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసిరుద్దీన్, మజ్లిస్ సీనియర్ నాయకులు హారూన్ ఫర్హాన్, బజరుద్దీన్ తదితరులు ఉన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

గోల్కొండ: విద్యార్థుల విజయ యాత్ర ఎస్ఎస్‌సీ నుంచి ప్రారంభమవుతుందని టోలిచౌకిలోని వీనస్ హైస్కూల్ కరస్పాండెంట్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. బుధవారం టోలిచౌకి డీలక్స్ కాలనీలోని వీనస్ హై స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా 9వ, 10వ తరగతి విద్యార్థులు ఎంతో ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహ్మద్ హిదాయత్ అలీఖాన్ మాట్లాడుతూ.. 25 ఏళ్ల నుంచి వీనస్ హైస్కూల్‌ను ఉత్తమ ప్రమాణాలతో నిర్వహిస్తున్నామని అన్నారు.పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ హన్నారీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.